చెత్త ప్రాసెసింగ్ ప్లాంట్ పరిశీలన

మణికొండ: ఇళ్ల నుంచి వస్తున్న చెత్తను తడి, పొడిగా సేకరించటంతో పాటు వాటిని వర్మికంపోస్టు ఎరువుగా, సాలిడ్ వేస్ట్ చెత్తగా వేరు చేసి ఆదాయం సమకూర్చుకోవటంతో పాటు పర్యావరణాన్ని పరిరక్షించే విధానాన్ని మున్సిపాలిటీల కమిషనర్లు గురువారం పరిశీలించారు. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని వట్టినాగులపల్లిలో ఉన్న చెత్త ప్రాసెసింగ్ ప్లాంట్ వద్ద తడి, పొడి, హానికరమైన చెత్తను వేరు చేసే పద్ధతిని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నార్సింగి మున్సిపాలిటీ డీఈ నరేష్, మేనేజర్ యోగేష్, ఏఈ శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

నేడు ఉచిత మెగా వైద్యశిబిరం

మణికొండ: షుగర్, లివర్, చర్మ వ్యాధులతో ఇబ్బందులు పడుతున్న వారికి ఉచితంగా పరీక్షలు నిర్వహించటంతో పాటు మందులు ఇస్తామని డాక్టర్ ప్రభు లైఫ్ మల్టీస్పెషాలిటీ క్లినిక్స్ చైర్మన్ డాక్టర్ ప్రభుకుమార్ తెలిపారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని లక్ష్మీప్రియ కాలనీలోని క్లినిక్‌లో శుక్రవారం ఉదయం 9గంటల నుంచి రాత్రి 9గంటల వరకు ఈ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

చెత్త తరలింపులో నిర్లక్ష్యం వద్దు

నిజాంపేట్: పరిసరాల శుభ్రత అందరి బాధ్యతని, చెత్త తరలింపులో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. గురువారం నిజాంపేట్ కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్ కొలన్ నీలారెడ్డి అధ్యక్షతన సమావేశం జరిగింది. పెండింగ్ పనులు, నిర్మాణ దశలో ఉన్న పనుల పురోగతిపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలు రోగాల బారిన పడకుండా పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలన్నారు. అదేవిధంగా ఓపెన్ జిమ్‌లు, పార్కులను సక్రమంగా నిర్వహించడంతో పాటు నూతన ఓపెన్ జిమ్‌ల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. పార్కుల్లో హైమాస్ట్ లైట్లు, మంజీర నీటి సదుపాయాన్ని కల్పించాలన్నారు. అదేవిధంగా వివిధ అభివృద్ధి పనుల నిమిత్తం కాలనీలల్లో తవ్విన రోడ్లకు ప్యాచ్ వర్క్ పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. ప్రగతినగర్ శ్మశానవాటికలో బోరు, విద్యుత్ దీపాల ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్, ఇన్‌చార్జి కమిషనర్ దిలీప్‌కుమార్, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో 23 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే వివేకానంద్ అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రభుదాస్, ఆర్ఐ నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి

సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి



మొక్కకు నీళ్లు పోస్తున్న కమిషనర్ అవినాష్ మహంతి

దుండిగల్: విధి నిర్వహణలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని, ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి దర్యాప్తు చేపట్టాలని సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి అన్నారు. మేడ్చల్ డీసీపీ పరిధిలోని దుండిగల్ పోలీస్‌స్టేషన్‌ను గురువారం తనిఖీ చేశారు. మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి, అడిషనల్ డీసీపీ పురుషోత్తం, ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి రిసెప్షన్‌లో ఫిర్యాదుల స్వీకరణ, వివిధ అంశాలపై ఆరా తీశారు. సిబ్బందికి సలహాలు, సూచనలు చేశారు. అనంతరం సీపీ మాట్లాడుతూ..సైబర్ నేరాలు విపరీతంగా పెరిగిపోతున్నాయని, వాటిని అరికట్టేందుకు పోలీస్ వ్యవస్థ కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుందన్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్క నాటారు. స్థానిక పోలీసుల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు.

స్థలం కేటాయించాలని మేయర్‌కు వినతి

నిజాంపేట్: మత్స్య పరిశ్రమ, పెద్దమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి స్థలం కేటాయించాలని గురువారం ముదిరాజ్ సంఘం సభ్యులు మేయర్ కొలన్ నీలారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్థానికంగా మత్స్య పరిశ్రమ ఏర్పాటు అయితే ముదిరాజ్‌లకు జీవనోపాధి లభిస్తుందని వివరించారు. దీనిపై స్పందించిన మేయర్.. అధికారులతో మాట్లాడి స్థలాన్ని కేటాయించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు సంఘం సభ్యులు పేర్కొన్నారు.


పగలూ.. వెలుగులు



లింగంపల్లిలో పగలు వెలుగుతున్న స్ట్రీట్‌లైట్

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్‌లో స్ట్రీట్ లైట్ల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. పగలు, రాత్రి తేడా లేకుండా నిరంతరాయంగా వెలుగుతున్నా సంబంధిత అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరించడంపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని లింగంపల్లిలో స్ట్రీట్‌లైట్లు పగలు, రాత్రి తేడా లేకుండా వెలుగుతుండటంతో విద్యుత్ దుబారా అవుతోంది. స్ట్రీట్‌లైట్ల నిర్వహణపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.







‘మై ఓన్ ట్రబుల్డ్ వరల్డ్’ చిత్రప్రదర్శన

ఆర్ట్‌గ్యాలరీలో ఆకట్టుకుంటున్న స్కల్పర్స్, చిత్రాలు

ఈనెల 26వ తేదీ వరకు కొనసాగింపు

ఉదయం 10.30 నుంచి రాత్రి 8గంటల వరకు..



మాదాపూర్: ఒక చిత్రం ఎన్నో విషయాలను చెబుతుంది. అర్థం కాని విషయాలను సైతం అర్థమయ్యేలా చేయగలదు. చిత్రకారులు తాము విన్న కథలను, ఊహ చిత్రాలను బొమ్మల రూపంలో చూపిస్తారు. అలాంటి చిత్రాలను, స్కల్పర్స్, ఇన్‌స్టాలేషన్‌లను అన్నదమ్ములు, చిత్రకళాకారులు గ్లోవర్ పాల్, లెస్టర్ ఆంథోనీపాల్‌లు వేసిన చిత్రాలను చిత్రమయి స్టేట్ ఆర్ట్‌గ్యాలరీలో మై ఓన్ ట్రబుల్డ్ వరల్డ్ పేరిట చిత్ర ప్రదర్శనను ఏర్పాటు చేశారు. నగరజీవితం, మనుషుల మధ్య వ్యత్యాసాలు, జరుగుతున్న పరిణామాలు తదితర అంశాలను తెలిపే విధంగా స్కల్పర్స్‌ను రూపొందించారు. వివిధ ఆర్ట్స్ కళాశాలల నుంచి వచ్చిన విద్యార్థులు చిత్రాల గురించి అడిగి తెలుసుకుంటున్నారు. కళాకారులు తాము వాడే ముడిపదార్థాలు, మెళకువలను వివరిస్తున్నారు. ఒక కళా రూపాన్ని వేయడానికి తీసుకోవాల్సిన సన్నివేశం, సందర్భం గురించి తెలియజేశారు. ప్రపంచంలో జరుగుతున్న సంఘటనలపై చిత్రాలు వేసినట్టు కళాకారులు తెలిపారు.





గ్యాలరీలో సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్న స్కల్పర్స్

వైభవంగా శ్రీవారి కల్యాణం

చందానగర్ : చందానగర్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం వేంకటేశ్వరస్వామి కల్యాణంను కన్నుల పండుగగా నిర్వహించారు. కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు భారీ సంఖ్యలో హాజరై స్వామి వారి కల్యాణాన్ని తిలకించారు.



పేదలకు అండగా సీఎంఆర్ఎఫ్



ఎల్ఓసీ పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

రాయదుర్గం: ముఖ్యమంత్రి సహాయనిధి ఆపదలో ఉన్నవారికి ఆపన్నహస్తం అందిస్తోందని ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు. గచ్చిబౌలి డివిజన్ ఖాజాగూడకు చెందిన రమేష్‌బాబు అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన రూ.1.50 లక్షల మంజూరు పత్రాన్ని గురువారం కుటుంబసభ్యులకు అందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో గుమ్మడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు సహకారమందించండి



జెడ్‌సీకి సమస్యలను వివరిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

ఆల్విన్‌కాలనీ: మౌలిక వసతుల కల్పనకు సహకరించాలని కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వచౌహాన్‌ను గురువారం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ కలిశారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లి పార్ట్, వివేకానందనగర్, ఆల్విన్ కాలనీ, హైదర్‌నగర్ డివిజన్‌లలో నెలకొన్న సమస్యలు, చేపట్టవలసిన పలు అభివృద్ధి పనులపై చర్చించారు. పెండింగ్ పనులు త్వరగా పూర్తయ్యేలా ఆదేశాలు ఇవ్వాలని, అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. అదే విధంగా వర్షాకాలం దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టాలన్నారు. ఉషా ముళ్లపూడి కమాన్ నుంచి ఎల్లమ్మబండ రోడ్డు విస్తరణలో భాగంగా రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాలను దూరంగా ఏర్పాటు చేయించాలన్నారు. ప్రగతినగర్ నుంచి జేఎన్‌టీయూ వరకు ఫ్లైఓవర్ పనులు ప్రారంభమయ్యేలి చర్యలు తీసుకోవాలని కోరగా జెడ్‌సి సానుకూలంగా స్పందించారని తెలిపారు.

రోగులకు మంచి ఆహారం అందించాలి

- డీసీహెచ్‌ఎస్ సంగారెడ్డి
- డయాలసిస్ యూనిట్ ఏర్పాటుకు స్థల పరిశీలన



మందుల రూంను పరిశీలిస్తున్న డీసీహెచ్‌ఎస్ సంగారెడ్డి

పటాన్‌చెరు టౌన్: రోగులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని డీసీహెచ్‌ఎస్ సంగారెడ్డి పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డికి సూచించారు. గురువారం ఆయన ప్రభుత్వ ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో రోగులకు అందిస్తున్న వైద్యం, ఆహారాన్ని పరిశీలించారు.రోగులకు అందించే ఆహారంలో గుడ్డుతో పాటు అరటిపండు ఇవ్వాలని సూచించారు. అనంతరం ఆస్పత్రి రిజిస్టర్‌ని పరిశీలించి స్కానింగ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు.అదేవిధంగా ఆపరేషన్ థియేటర్‌ను సెకండ్ ఫ్లోర్ నుంచి గ్రౌండ్ ఫ్లోర్‌కు షిఫ్ట్ చేయాలని సూచించారు. డయాలసిస్ యూనిట్ ఏర్పాటు కోసం రూంలను పరిశీలించారు. వైద్యులతో సమావేశమయ్యారు. కార్యక్రమంలో ఆర్‌ఎం ప్రవీణ పాల్గొన్నారు.

వాతావరణం చాలా కీలకం



ట్రిపుల్‌ఐటీలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు

రాయదుర్గం: వాతావరణం చాలా ముఖ్యమని, ప్రస్తుతం వివిధ రకాలుగా మారిపోతుండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ ఏపీసీ సీఈఓ రవి సర్కునస్ పేర్కొన్నారు. ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్‌లో సోషల్ ఇంక్యుబేటర్ ఆధ్వర్యంలో కోహ్లీ రీసెర్చ్ బ్లాక్‌లో ‘స్టార్టప్ ఇన్నోవేషన్ ఇన్ క్లైమేట్ యాక్షన్’ అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినూత్న ఆలోచనలు పరిష్కార మార్గాలను అందించడంలో స్టార్టప్‌లు కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో బ్రిటీష్ హైదరాబాద్ డిప్యూటీ హై కమిషనర్ గారెత్ విన్ ఓవెన్, ట్రిపుల్‌ఐటీ ఫ్యాకల్టీ, ఆర్‌ఐసీహెచ్, ఈపీఏఎం సిస్టమ్స్, స్టేట్ స్ట్రీట్స్, క్యాస్పియన్, ఐఈఈఎంఏ, కార్పొరేట్, పెట్టుబడిదారు, ఇంక్యుబేటర్ల ప్రతినిధులు, విద్యావేత్తలు, పర్యావరణ వ్యవస్థ వాటాదారులు పాల్గొన్నారు.

జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు వినతి



కమిషనర్ ఇలంబర్తికి వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ పుష్పనగేష్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్‌లోని అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తిని గురువారం కార్పొరేటర్ పుష్పనగేష్ కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రామచంద్రాపురం పట్టణంలో ఫంక్షన్‌హాల్, థీమ్ పార్కు, మీట్ మార్కెట్, రాయసముద్రం చెరువు అభివృద్ధి, శ్మశానవాటిక అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరగా ఆయన సాకుకూలంగా స్పందించి విడతల వారీగా మంజూరు చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం పట్టణంలో డ్రైనేజీ సమస్య పరిష్కారం కోసం జలమండలి ఎండీ అశోక్‌రెడ్డిని కలసి వినతిపత్రం అందించినట్లు తెలిపారు.

ఆరుగురికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమాన విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.... బుధవారం నిర్వహించిన డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో ఆరుమందిని పట్టుకున్నట్లు చెప్పారు.పట్టుబడిన వాహనదారులను గురువారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా ఆరు మందికి ఒక్కొక్కరికి రూ. 2 వేలు జరిమాన విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

గుర్తు తెలియని మహిళ మృతి



చందానగర్ : గుర్తు తెలియని మహిళ మృతి చెందిన సంఘటన చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. గురువారం ఉదయం ఓల్డ్ ఎంఐజీ నల్లగండ్ల అండర్‌బ్రిడ్జి కింద గుర్తు తెలియని యాచకురాలు (65) పడి ఉండడాన్ని పోలీసులు గమనించారు. పరిశీలించగా మృతి చెందినట్టు గుర్తించారు. పోస్ట్‌మార్టమ్ నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఆమె ఒంటిపై ఎర్ర రంగు చీర, తెల్ల బ్లౌజ్ ఉంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

అధికారులు సమన్వయంతో పని చేయాలి

- ఎమ్మెల్యే గాంధీ



అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే గాంధీ, వెస్ట్ జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి తదితరులు

గచ్చిబౌలి: ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఎమ్మెల్యే గాంధీ సూచించారు. గురువారం శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ కార్యాలయంలో జడ్సీ ఉపేందర్ రెడ్డి అధ్యక్షతన అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక డ్రైవ్ చేపట్టి ఫుట్‌పాత్‌ల ఆక్రమణలను తొలగించాలని టౌన్‌ప్లానింగ్ అధికారులకు సూచించారు. లింకురోడ్డు పనులు, మంజీరా పైప్‌లైన్ రోడ్డు పనులు, శ్రీదేవి థియేటర్ రోడ్డు విస్తరణ పనులను వెంటనే చేపట్టాలని జడ్సీ దృష్టికి తీసుకెళ్లారు. పార్కులు, వర్షాలకు దెబ్బతిన్న రోడ్ల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలన్నారు. వెస్ట్ జోనల్ కమిషనర్ ఆర్.ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ త్వరితగతిన జంక్షన్లు అభివృద్ధి చేసి ట్రాఫిక్ నివారణ చర్యలు చేపడతామని తెలిపారు. రోడ్ల విస్తరణలో స్థలం కోల్పోయిన బాధితులకు టీడీఆర్ త్వరగా ఇప్పించేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. విద్యుత్ స్తంభాలు, కేబుళ్ల మార్పిడిపై విద్యుత్ శాఖ, వర్షాకాలం వాటర్ లాగింగ్ పాయింట్ల వద్ద వరద నివారణకు, రోడ్ల మరమ్మతులకు చర్యలు చేపట్టాలని ఆయా అధికారులను ఆదేశించారు. ఐటీ కారిడార్‌లో మెరుగైన వసతుల కల్పనకు అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మాదాపూర్ ఏడీసీపీ జయరాం, డీసీలు ముకుంద్ రెడ్డి, మోహన్ రెడ్డి, సురేష్, సుల్తానా, వెస్ట్ జోనల్ సిటీ ప్లానర్ శ్యామ్ కుమార్, ట్రాఫిక్, టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్, అర్బన్ బయోడైవర్సిటీ, టీజీఎస్‌పీడీసీఎల్, జలమండలి తదితర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: విద్యుత్ సంబంధిత మరమ్మతుల కారణంగా సరఫరా నిలిపివేస్తున్నామని గచ్చిబౌలి ఏడీఈ సతీష్ ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు కేవీ గచ్చిబౌలి సబ్‌స్టేషన్ పరిధిలోని టెలిఫోన్ ఎక్స్ఛేంజీ క్వార్టర్స్‌లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.



పార్కును ప్రారంభించరా?

- రూ. 2 కోట్లతో రెండు ఎకరాల్లో ఏర్పాటు
- సందర్శకులను ఆకట్టుకునేలా పచ్చదనం
- ప్రజలకు అందుబాటులోకి రాని వైనం

> సుమారు రూ.2 కోట్ల వ్యయంతో రెండు ఎకరాల్లో అత్యాధునిక సౌకర్యాలతో ఎన్విరాన్‌మెంట్ పార్కును తీర్చిదిద్దింది గత ప్రభుత్వం. ఎన్నికల ముందు శంకుస్థాపన చేసి పనులను తొందరగానే ముగించారు. సకల సదుపాయాలతో పచ్చదనంతో పార్కును తీర్చిదిద్దారు. ఎన్నికలు రావటంతో పార్కు ప్రారంభోత్సవం వాయిదా పడింది. సుమారు రెండు సంవత్సరాలు కావస్తున్నప్పటికీ ఆ పార్కును ప్రజలకు అందుబాటులోకి తీసుకురాకపోవటంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పార్కును అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.



చిన్నారులు ఆడుకునే వస్తువులు, వాకింగ్ ట్రాక్

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని ఆస్‌బెస్టాస్ కాలనీ, పాపిరెడ్డినగర్ కాలనీల మధ్య గల స్వచ్ఛబడి (హుడా) పార్కును నాటి రాష్ట్ర ప్రభుత్వం ఎన్విరాన్‌మెంట్ పార్కు కోసం అందమైన పార్కుగా తీర్చిదిద్దింది. సకల సౌకర్యాలు కల్పించారు. ఎన్నికలకు ముందు హడావుడిగా శంకుస్థాపన చేసి పనులను కూడా అంతే శరవేగంతో పార్కు అభివృద్ధికి బాటలు వేశారు. నూతన ప్రభుత్వం ఏర్పడి 10 నెలలు కావస్తున్నప్పటికీ ప్రారంభోత్సవానికి నోచుకోలేదు. ఎన్విరాన్‌మెంట్ పార్కు పేరుతో పార్కులో ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మించటానికి ప్లాస్టిక్ వస్తువుల రీసైక్లింగ్ కోసం మౌలిక వసతుల కల్పన, మొక్కల పెంపకం, ఆరోగ్య పరిరక్షణ పట్ల అవగాహన కల్పించే విధంగా ఏర్పాటు చేశారు. నూతన టెక్నాలజీ స్క్రీన్‌లు సైతం ఏర్పాటు చేశారు. నగరంలోనే ఈ స్వచ్ఛబడి పార్కును ఎన్విరాన్‌మెంట్ పార్కుగా సందర్శకులను ఆకట్టుకునేలా తీర్చిదిద్దారు. కోట్ల రూపాయలతో నిర్మించిన పార్కును ప్రారంభించాలని కాలనీ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

మేమే ప్రారంభించుకుంటాం



ఎన్విరాన్‌మెంట్ పార్కు మా కాలనీలో ఏర్పాటు అవుతుందని ఎంతగానో ఆనందపడ్డాం. వాకింగ్, యోగా చేసుకునేవాళ్లం. స్వచ్ఛ బడి పార్కును త్వరలో ప్రారంభించకపోతే స్థానికులందరం కలిసి పార్కును ప్రారంభించుకుంటాం.

– సువర్ణ, స్థానికురాలు



